ప్రజాశక్తి
మంగళవారం 13 ఫిబ్రవరి, 2024
5
శ్రీకాకుళం

ఎఎస్‌పి (క్రైమ్) బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎఎస్‌పి (క్రైమ్)గా బి.ఉమామహేశ్వరరావు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరు జిల్లా నుంచి ఇక్కడకు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఎస్‌పి జి.ఆర్ రాధికను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న ఉమామహేశ్వరరావు

అభివృద్ధిపై శ్వేతపత్రానికి సిద్ధమా?

- బహిరంగ చర్చకు టైమ్, డేట్ చెప్పాలని సవాల్
- ఇసుక దోపిడీ తప్ప ధర్మాన చేసిందేమీ లేదు
- ఐటి పరిశ్రమ ఇచ్చిన భూమి కేటాయించలేదు
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పోలాకి, ఆమదాలవలస

శ్రీకాకుళం నియోజకవర్గానికి తామేం చేశామో శ్వేతపత్రం విడుదల చేస్తామని, ఇందుకు సిద్ధమా అని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. శంఖారావం యాత్రలో భాగంగా రెండో రోజు సోమవారం నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస నియోజకవర్గాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తనయుని ఇసుక దోపిడీ తప్ప నియోజకవర్గానికి చేసిందేమిటని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధిపై తేదీ, సమయం చెప్తే తాము బహిరంగ చర్చకు సిద్ధమన్నారు. మంత్రిగా ఉండి ధర్మాన కనీసం రోడ్లను పూడ్చలేకపోయారని విమర్శించారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో సావిత్రిపురం దగ్గర 23 ఎకరాలను మంత్రి ధర్మాన, ఆయన కుటుంబసభ్యులు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్రలో సెజ్‌ను ఏర్పాటు చేసి జిల్లాకు పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగావకాశాలను కల్పిస్తామని చెప్పారు. శ్రీకాకుళంలో ఐటి పరిశ్రమ ఇచ్చినా పరిశ్రమల శాఖ ప్రభుత్వం భూమి కేటాయించలేదన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే మాజీ సైనికులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించారని, ఒక్క అభివృద్ధి కార్యక్రమమైనా చేశారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు కబ్జా చేయాలనే ఆలోచన తప్ప ఏనాడూ నియోజకవర్గం గురించి ఆలోచించలేదన్నారు. అధికారంలోకి వస్తే బొంతు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. శ్రీముఖలింగం ఆలయాన్ని అభివృద్ధి చేసే బాధ్యత వ్యక్తిగతంగా తానే తీసుకుంటానన్నారు. పాదయాత్రలో ఆమదాలవలసలో షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీనిచ్చి నేటికీ తెరిపించలేదని విమర్శించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమదాలవలస నియోజకవర్గం అభివృద్ధిలో ముందుండాలని, కానీ ఇక్కడ సొంత ఆదాయం పెంచుకోవడంపైనే దృష్టి పెట్టారని ధ్వజమెత్తారు. ల్యాండ్, సాండ్ మాఫియాకు అడ్డాగా ఆమదాలవలసను మార్చారంటూ తీవ్ర విమర్శలు చేశారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అవినీతి, భూముల ఆక్రమణపై విచారణ వేసి వడ్డీతో చెల్లించి ప్రజలకు అప్పగిస్తామన్నారు. వంశధార నదిపై పురుషోత్తపురం వద్ద, నాగావళి నదిపై దూసి వద్ద వంతెలను నిర్మిస్తామని హామీనిచ్చారు. ఆమదాలవలసలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు ప్రవీణ్‌కుమార్, కోరాడ సర్వేశ్వరరావు, పేడాడ రామ్మోహన్ పాల్గొన్నారు.

రోడ్డు వేసుకోలేకపోయారు : ఎంపీ

తమ్మినేని సీతారాంను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇసుక దందా, దోపిడీ కోసమే పదవులను ఉపయోగించుకున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు విమర్శించారు. మంత్రి, స్పీకర్‌గా ఉన్న వ్యక్తులు శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును వేసుకోలేకపోయారని విమర్శించారు. శ్రీకాకుళం నగరంలో ఐదేళ్లు అవుతున్నా స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి చేయకుండా గాలికొదిలేశారని విమర్శించారు.

లోకేష్‌కు నాగలిని బహుకరించిన టిడిపి నాయకులు

గత పనులూ పూర్తి చేయలేకపోయారు

టిడిపి హయంలో నిర్మించిన వంతెనలకు ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ రిబ్బన్లు కట్ చేస్తున్నారని నరసన్నపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బగ్గు రమణమూర్తి విమర్శించారు. గత ప్రభుత్వ హయంలో ప్రారంభించిన పనులనూ పూర్తి చేయలేకపోయారని చెప్పారు.

సూపర్ 6 పథకాలను వివరిస్తున్న లోకేష్

శ్రీకాకుళం నియోజకవర్గంలో 1,238 టిడ్కో ఇళ్లను నిరర్థకంగా మార్చారని శ్రీకాకుళం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండ లక్ష్మీదేవి విమర్శించారు. కళింగపట్నం ఎత్తిపోతల పథకాన్ని 80 శాతం పూర్తి చేసినా మిగిలిన 20 శాతం ధర్మాన ప్రసాదరావు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.

కమీషన్లు ఇవ్వకపోతే పనులు రద్దు

టిడిపి హయాంలో రోడ్ల కోసం మంజూరు చేసిన నిధులను వినియోగించుకోలేని అసమర్థుడు తమ్మినేని సీతారాం అని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మంచినీటి పథకం కోసం గత టిడిపి ప్రభుత్వం రూ.276 కోట్లు మంజూరు చేస్తే కమీషన్ల కోసం వాటిని రద్దు చేశారని విమర్శించారు.

లోకేష్‌కు పలువురు వినతులు

సిపిఎస్‌తో పాటు మోసపూరిత జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన న్యాయవాదులు వినతిపత్రం ఇచ్చారు. ఇస్లాం బ్యాంకు ద్వారా మైనార్టీల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. గోపాలమిత్ర పథకాన్ని పునరుద్ధరించి గోపాలమిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలంటూ సంఘ ప్రతినిధులు కోరారు. కళింగ కోమటి, సొండి సామాజిక తరగతులను ఒబిసిలో జాబితాలో చేర్చాలని ఆయా సంఘాల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తామంతా రోడ్డున పడ్డామని, తమ సేవలను వినియోగించుకోవాలంటూ మీసేవ నిర్వాహకులు విన్నవించుకున్నారు.

18న జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 18వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జిల్లా కమిటీ సభ్యులు కె.నాగమణి పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో సదస్సు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు కావస్తున్నా, జిల్లాలో వంశధార, నాగావళి వంటి నదులు, సువిశాల సాగుభూమి, సుదీర్ఘ సముద్రతీరం, అటవీ సంపద ఉన్నా జిల్లా వెనుకబాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా సమగ్రాభివృద్ధిపై నిర్వహిస్తున్న సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, పూర్వ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ, గ్రేటర్ విశాఖ సిపిఎం కార్పొరేటర్ బి.గంగారావు, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీరు ఉప్పలపాటి నారాయణరావు, అనేకమంది ప్రముఖులు, మేధావులు ముసాయిదా పత్రాలను ప్రజెంట్ చేస్తారని చెప్పారు. వీటిపై చర్చించి సమగ్రాభివృద్ధికి సూచనలు తయారు చేయనున్నట్లు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

అప్రెంటిస్ విధానం వద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటిస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిఎస్‌సి నోటిఫికేషన్‌లో అప్రెంటిస్ విధానాన్ని పొందుపరచడాన్ని నిరసిస్తూ నగరంలోని డే నైట్ కూడలి వద్ద నోటిఫికేషన్ ప్రతులను యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు సోమవారం దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచబ్యాంకు సంస్కరణల్లో భాగంగా ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా నాటి ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. 1994 నుంచి పెద్దఎత్తున పోరాటాలు చేసి 2012లో రద్దు చేసుకోగలిగామని గుర్తుచేశారు. మళ్లీ అదే విధానాన్ని తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తిరిగి వెట్టిచాకిరీ విధానాన్ని జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ మెగా డిఎస్‌సి అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం తక్కువ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడమే కాకుండా నియామకం పొందిన ఉపాధ్యాయులను మళ్లీ అప్రెంటిస్ విధానంలోకి నెట్టడం తీవ్రమైన చర్య అన్నారు. దీనికి ప్రభుత్వం కచ్చితంగా తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు, జి.సురేష్, జిల్లా నాయకులు పి.బాబూరావు, కె.సరేష్ కుమార్, పి.చిన్నారావు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

101 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయ నియామక పరీక్షకు జిల్లాలో 101 పోస్టులతో ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్‌ను సోమవారం విడుదల చేసింది. ఖాళీల వివరాలను ఇంకా పేర్కొనలేదు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మహిళలు ఇతరులకు సంబంధించిన ఖాళీ పోస్టుల రోస్టర్ విధానాన్ని పొందుపరచలేదు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ఈనెల 22వ తేదీ వరకు చేపట్టనున్నారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 21 వరకు ఫీజు చెల్లింపునకు గడువు ఇచ్చారు. 22 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఒక్కో పోస్టుకు రూ.750 చొప్పున దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం https://apdsc.apcfss.in వెబ్‌సైట్‌ను పొందుపరిచారు. మార్చి 5 నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. మార్చి 15 నుంచి 30 వరకూ ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక సెషన్‌గా, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో సెషన్‌గా పరీక్షలు నిర్వహించనున్నారు. 31న ప్రాథమిక కీ విడుదల చేసి, ఏప్రిల్ ఒకటో తేదీన కీపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. రెండో తేదీన ఫైనల్ కీ, 7వ తేదీన డిఎస్‌సి ఫలితాలను ప్రకటించనున్నారు. 2018 సిలబస్ ప్రకారమే పరీక్షలు నిర్వహించనున్నారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితి 44 ఏళ్లు, రిజర్వు కేటగిరీ అభ్యర్థులకు మరో ఐదేళ్లకు పెంచారు.

టిడిపి శవయాత్ర

- లోకేష్ నోరు విప్పితే అబద్ధాలే
- వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ ధ్వజం

ప్రజాశక్తి - నరసన్నపేట

ఉత్తరాంధ్ర నుంచి శంఖారావం పేరుతో నారా లోకేష్ చేస్తున్న యాత్ర టిడిపి శవయాత్ర అని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నియోజకవర్గంలో పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ ఏదో యాత్ర పేరుతో జిల్లాకు వచ్చిన లోకేష్ పగటి కలలు కంటున్నారని విమర్శించారు. లోకేష్ నోరు విప్పితే అన్నీ అబద్ధాలే అన్నారు. తనకు తాను సచ్ఛీలునిగా, నిప్పుగా అభివర్ణించుకుంటున్నాడని... అతడు నిప్పుడు కాదు ఇనుముకు పట్టే తుప్పు అని దుయ్యబట్టారు. లోకేష్‌కు మేనిఫెస్టో అంటే తెలుసా అని ప్రశ్నించారు. ఎన్నికలు అయిపోయిన వెంటనే దాని గురించి మర్చిపోయే వారికి, అదే మేనిఫెస్టోను దైవంలా భావించి 99 శాతం హామీలు నెరవేర్చిన తమకు ఎంతో తేడా ఉందన్నారు. వీధి వీధికి బెల్టుషాపులు పెట్టి ఒళ్లు గుల్ల చేసింది మీరు కాదా అని నిలదీశారు. వైసిపి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ ఇలా నిర్మాణాలతో వారి కళ్లు బైర్లు కమ్మాయన్నారు. ఈ ఎన్నికల్లోనూ ఓడిపోతామని తెలిసి ఎలాగూ ఇచ్చేది లేదనితండ్రీ కొడుకులు నోటికి ఏది పడితే అది వాగ్దానాలు చేస్తున్నారని చెప్పారు. 14 ఏళ్లు సిఎంగా చేసిన చంద్రబాబు నాయుడు పేరు చెప్తే గుర్తొచ్చే ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు. పందికొక్కుల్లా రాష్ట్రాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర అంటే ఓటు బ్యాంకుగా చూశారే తప్ప ఒక్క పోర్టు గానీ, మంచినీటి పథకం గానీ, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ గానీ వంశధార గానీ, రిమ్స్ ఆస్పత్రి గానీ ఏదైనా చేయగలిగారా అని ప్రశ్నించారు. ఒక బిసిని డిప్యూటీ సిఎం చేయగలిగిన గొప్ప మనసున్న నాయకుడు జగన్మోహన్ రెడ్డి అని కొనియాడారు. బిసిలను వాడుకుని వదిలేసిన ఘనత తండ్రీ కొడుకులది అని అన్నారు.

కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

రేపట్నుంచి ప్రత్యక్ష ఆందోళనలు

ఎపి జెఎసి జిల్లా అధ్యక్షులు సాయిరాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మొండివైఖరికి నిరసనగా ఈనెల 14 నుంచి ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టనున్నట్లు ఎపి జెఎసి జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తెలిపారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పిఆర్‌సిలో 30శాతం ఫిట్‌మెంటు వెంటనే ప్రకటించాలని, సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు డిఎలను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ వారికి డిఎ బకాయిలు 90 శాతం నగదు రూపంలో చెల్లించాలన్నారు. 11వ పిఆర్‌సిలో ఇప్పటికీ ఎరియర్స్, సరెండర్ లీవ్ బకాయిలు, పిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లయిమ్‌లు వెంటనే చెల్లించాలని కోరారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయ నియామకాల్లో ప్రవేశపెట్టిన అప్రెంటిషిప్‌ను రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేయాలన్నారు. గురుకులాలు, సొసైటీ లు, పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని, గతంలో మృతి చెందిన ఉద్యోగుల కుటుంబాలకు సామాజిక భద్రత కింద కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 14న తాలూకా, జిల్లాస్థాయిలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలపడంతో పాటు తహాశీల్దార్, ఆర్‌డిఒలు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. 15, 16 తేదీల్లో మధ్యాహ్న భోజన సమయంలో నిరసన, 17న తాలూకా స్థాయిలో ర్యాలీలు, 20న జిల్లా కేంద్రంలో ర్యాలీ, ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. 21 నుంచి 24 వరకు రాష్ట్ర నాయకులు జిల్లాలో పర్యటిస్తారని, 27న చలో అసెంబ్లీ చేపట్టనున్నట్లు చెప్పారు. వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘ నాయకులు బడగల పూర్ణచంద్రరావు, ఆర్.వేణుగోపాల్, పూజారి జానకిరామ్, కె.రోజారాణి, బొత్స శ్రీనివాసరావు, జి.లలిత, ఎ.సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సాయిరాం

బిఎల్‌ఒ సస్పెన్షన్

శ్రీకాకుళం అర్బన్ : విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బిఎల్‌ఒ, ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం గ్రామ హార్టికల్చర్ అసిస్టెంట్ పి.రవికుమార్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సస్పెండ్ చేశారు. అప్పటి తహశీల్దార్ (ఎఇఆర్ఒ) టి.సత్యనారాయణ, బిఎల్ఒ సూపర్‌వైజర్ సిహెచ్.ప్రేమ్‌కుమార్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ భవనాల్లో నివసించే వారు చుట్టుపక్కల కాలనీల్లో అద్దెకు నివాసం ఉంటున్నారు. ఎక్కువ మంది ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు ఉద్యోగులు కావడంతో వారిలో కొందరు పలు ప్రదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వారి కుటుంబాలు ఇప్పటికీ సొంత గ్రామాల్లో నివాసముంటున్నాయి. అయినా ఎచ్చెర్ల మండలంలోని పోలింగ్ బూత్ నంబరు 254లో వీరి ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటుచేసుకున్నాయని, ఎన్నికల విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని విచారణలో గుర్తించి కలెక్టర్‌కు నివేదించారు. నివేదిక ఆధారంగా కలెక్టర్ చర్యలు చేపట్టారు. ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా నుంచి 30,574 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 145 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 7 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 145 మంది చీఫ్ సూపరింటెండెంట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. జిల్లా విద్యా శాఖ సహాయ కమిషనర్ లియాఖత్ అలీఖాన్ పరీక్షల నిర్వహణకు సంబంధించి కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమల్లో ఎలాంటి అలసత్వం చూపరాదని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా 1.84 లక్షల కార్డుల పంపిణీ మాత్రమే జరిగిందని, ఇంకా మిగిలిన కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి త్వరితగతిన పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు రిజిస్ట్రేషన్లు జిల్లాలో ఇప్పటివరకు 22,081 మాత్రమే జరిగాయని, మిగిలిన వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. సర్వర్ ఎర్రర్, మిస్ మాచ్ లాంటి సాంకేతిక సమస్యలకు జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులను కల్పించడంలో భాగంగా 2003 జులై 31కు ముందు కేటాయించిన భూములపై సర్వేను పూర్తి చేయాలని చెప్పారు. రీ సర్వే, డిజిటల్ సైన్, కోర్టు కేసులు తదితర అంశాలపై సమీక్షించారు. గ్రామ సచివాలయ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ డేటాను త్వరితగతిన సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మథరావు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, గ్రామ సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

అసౌకర్యాలనే మాట రాకూడదు

- సమన్వయంతో రథసప్తమి ఉత్సవాల నిర్వహణ
- కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 16న అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. రథసప్తమి వేడుకల ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమన్వయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ముందస్తుగా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని, నిరంతరం తాగునీటిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. వికలాంగులు, వృద్ధుల కోసం వీల్‌చైర్స్ ఏర్పాటు చేసి, అవి ఎక్కడ అందుబాటులో ఉన్నాయో తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం సిసి కెమెరాలు పనిచేసేలా చూడాలని, కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రెవెన్యూ, దేవాదాయశాఖ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో వాహనాల పార్కింగ్‌కి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. పుష్కరిణి పరిసరాల్లో లైటింగ్ ఏర్పాట్లు చేయాలన్నా రు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక, శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా, ఎఎస్‌పి ప్రేమ్ కాజల్, డిఆర్ఒ గణపతిరావు, ఆర్‌డిఒ సిహెచ్. రంగయ్య, దేవాదాయశాఖ ఆర్‌జెసి విజయ్‌కుమార్, సహాయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ పట్నాయక్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, అరసవల్లి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికుల సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టంపై అవగాహనతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై చర్చించేందుకు రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం ఆవోపా కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా భవన నిర్మా ణ కార్మిక సంఘం నాయకులు ఎం.ఆదినారా యణమూర్తి, తంగి హరి నారాయణ, మంతెన హరినాథ్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ రాజకీయ పార్టీల జిల్లా నాయకత్వం ఈ సమావేశంలో హాజరు కావాలని కోరారు. జిల్లాలో ఉన్న సుమారు లక్షమంది నిర్మాణ కార్మికుల కుటుంబాల సమస్యను దృష్టిలో పెట్టుకుని ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

'స్పందన'కు 220 వినతులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పొందూరు మండలం బురిడి కంచరాం గ్రామానికి చెందిన మీసాల భాగ్యలక్ష్మి తనకు వారసత్వంగా వచ్చిన భూములు ఆక్రమణలకు గురైనట్టు స్పందనలో జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ సమూన్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో ఆయన వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 220 వినతులు వచ్చాయి. తన తండ్రి మీసాల ఆనందరావుకు వివిధ సర్వేనంబర్ల పరిధిలో బురిడి కంచరాంలో 3.46ఎకరాల భూములు ఉన్నాయని, వాటిని వంశపారంపర్యంగా తల్లిదండ్రుల మరణానంతరం తనకు పూర్తి ఆస్తిహక్కు కలిగి ఉన్నట్టు తెలిపారు. ఆ భూములను ప్రస్తుతం గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని, పొందూరు తహశీల్దారు కార్యాలయంలో పలుమార్లు ఫిర్యాదులు ఇచ్చినా ఇంతవరకు సమస్యను పరిష్కరించలేదని భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. వంశధార ప్రాజక్టు పరిధిలో పాడలి గ్రామానికి చెందిన నీలకంఠం తన భూమికి నష్ట పరిహారం చెల్లించాలని ఫిర్యాదు అందించారు. సంతబొమ్మాళి మండలం మూలపేట గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి తన భూమికి పరిహారం చెల్లించకుండా పోర్టు పరిధిలో భూసేకరణ జరిపారని, స్థానికంగా లేని కారణంగా పరిహారం అందుకోలేక పోయానని తెలిపారు. హిరమండలం మండలం చిన కోరాడ కాలనీకి చెందిన మగ్గు తిరుపతిరావు తనకు అదనపు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

పరిహారం చెల్లించాలని కోరారు. అదే గ్రామానికి చెందిన సిరిపల్లి లీల నిర్వాసితుల కాలనీలో స్థలం మంజూరు చేసినప్పటికీ ఇంటి నిర్మాణానికి పరిహారం చెలిలంచలేదని ఫిర్యాదు చేశారు. చిన్న కోరాడ గ్రామానికి చెందిన బొడ్డు తులసమ్మ గతంలో ప్రభుత్వం తనకిచ్చిన ఇంటి స్థలం కబ్జాకు గురైందని ఆక్రమణలు తొలగించి స్థలాన్ని తనకు ఇప్పించాలని కోరారు. కాశీబుగ్గ పట్టణానికి చెందిన సుబ్రహ్మణ్యం నెహ్రూ నగర్‌లో తాను కొనుగోలు చేసుకున్న ఇంటి స్థలాన్ని కొందరు అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నారని, అన్ని పత్రాలు తన వద్ద ఉన్నా రెవిన్యూ సిబ్బంది తన స్థలాన్ని అప్పగించడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందనలో వస్తున్న ఫిర్యాదులపై క్షేత్ర స్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ డా. మనజీర్ జిలానీ సమూన్ జిల్లా అధికారులను హెచ్చరించారు. వినతుల స్వీకరణ అనంతరం అంధులకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహన్‌రావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ వినతులను స్వీకరించారు. ఇచ్ఛాపురంలో బిల్డింగ్ 2020-21లో సచివాలయానికి రంగులు, మరమ్మతులు చేపట్టామని, దానికి సంబంధించిన బిల్లులు చెల్లించాలని బాధితుడు తిరుపతిరావు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ దొరబాబు, జెడ్‌పి సిఇఒ డి.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి బి.మీనాక్షి, డ్వామా పీడీ చిట్టి రాజు, డిసిహెచ్‌ఎస్ డా.రాజ్యలక్ష్మి, హౌసింగ్ పిడి గణపతిరావు, వంశధార ఎస్ఇ డోల తిరుమల రావు, సమగ్ర శిక్ష ఎపిసి రోణంకి జయప్రకాష్, డిపిఒ రవికుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ విడుదల

చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యాన ఈనెల 15న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ జాబ్‌మేళాలో 13 ప్రైవేట్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. పదో తరగతి నుంచి పిజి వరకు ఏదైనా విద్యార్హత కలిగి ఉన్న నిరుద్యోగ యువత సద్వినియోగ పరచుకోవాలని కలెక్టర్ సూచించారు. మరిన్ని వివరాలకు 9550967353, 8317652552 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోటీలకు బయలుదేరుతున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

జాతీయస్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- బూర్జ

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కె.కె.రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వై.మాలతి తెలిపారు. గతేడాది డిసెంబర్‌లో జరిగిన అంతర్ జిల్లా ఆర్థరైటిక్స్ 60 మీటర్ల పరుగు పందెంలో సలాదుల తులసి అండర్-14 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే 16 సంవత్సరాల విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో సాసుబిల్లి మాధురి ప్రథమ స్థానంలో నిలిచింది. వీరిద్దరూ ఈనెల 18 నుంచి గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల పిఇటి ఇ.అప్పన్న, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పి.సుందర్రావు, ఎంవి.రమణ, బి.సాంబమూర్తి, బి.మాధవరావు, హరిబాబుతో పాటు ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు. విద్యార్థులకు పిఎల్ దేవీపేట యూత్‌సభ్యులు ఆర్థికసాయాన్ని అందజేశారు.

ట్రోఫీని అందజేస్తున్న బాలకృష్ణ, సీతంనాయుడు

క్రీడాకారులకు అభినందనలు

లావేరు: విద్యార్థి దశనుంచే యువత క్రీడల్లో రాణించాలని మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ అన్నారు. ఇటీవల ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడల్లో గెలుపొందిన విజేతలకు సోమవారం ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లో దృష్టి సారించాలన్నారు. జిల్లాకు చెందిన కరణం మల్లేశ్వరి, పూజారి శైలజ తదితరులు జాతీయస్థాయి క్రీడల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా పలు ఆటల్లో పాల్గొన్న 74 మందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గొర్లె భాస్కరరావు, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, ఇఒపిఆర్‌డి ప్రభాకరరావు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, ఎంపిడిఒ కార్యాలయ సీనియర్ సహాయకులు మాధవరావు పాల్గొన్నారు.

అవకతవకలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి- పొందూరు

మణెమ్మ, సర్పంచ్

మండలం తాడివలస పంచాయతీ పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న ఇళ్లపట్టాల పంపిణీలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తమ్మినైన మణెమ్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలని భావిస్తే గ్రామంలో ఇళ్లు ఉన్న అధికారపార్టీకి చెందిన వారికే పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. అంతేకాకుండా కొంతమందికి ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు డబ్బులు వసూలు చేసారని తెలిపారు. దీనిపై పలుమార్లు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశామని, ఇంతవరకూ ఎటువంటి విచారణ జరపలేదని పేర్కొన్నారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి గ్రామంలో ఇళ్లపట్టాలు పంపిణీపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె కోరారు.

గ్రామీణ బంద్ విజయవంతంపై బైక్ ర్యాలీ

ప్రజాశక్తి- పలాస

రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ఈ నెల 16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు ఎన్.గణపతి పిలుపునిచ్చారు. ఈ మేరకు కాశీబుగ్గ పెట్రోల్ బంక్ దరి పెంట దాలయ్య ఆశ్రమం నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలి, అక్కడి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఇందిరా చౌక్ మీదుగా పలాస జూనియర్ కాలేజి వరకు సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంద్రంలోని మోడీ ప్రభుత్వం విధానాల వల్ల రైతులు, కార్మికులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు సాగునీరు అందించే చర్యలు చేపట్టడం లేదన్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించి అమలు చేయడంలో పూర్తిగా ప్రభుత్వం విఫలమైందన్నారు. వ్యవసాయంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు, గనులు, సహజ వనరులు సైతం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. కార్పొరేటకు ఆటంకంగా ఉండకూడదని నలభై నాలుగు కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చేసి కార్మికులను కార్పొరేట్ల బానిసలుగా తయారు చేయాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వేణుగోపాల్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు టి.సన్యాసిరావు, ఎఐసిసిటియు నాయకులు డి.శ్రీనివాస్, ఐద్వా నాయకులు ఎన్.ఢిల్లేశ్వరి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి.భాస్కరరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, భవన నిర్మాణ సంఘం నాయకులు సింహాచలం, ఎఐకెఎంఎస్ నాయకులు వి.పాపయ్య, ఎఐకెఎం నాయకులు ఎం.రామరావు పాల్గొన్నారు.

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆంధ్రుల ఆత్మగౌరవం తాకట్టు

ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదమైన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ జరుగుతుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నామమాత్రంగా తీర్మానం చేసి ఊరుకున్నారని, పార్లమెంట్‌లో తమ ఎంపీలతో, రాష్ట్రంలో తమ ఎమ్మెల్యేలతో కేంద్రంపై పోరాటానికి ఎందుకు వెనకంజ వేస్తున్నారని అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వంకల మాధవరావు అన్నారు. మండలంలోని కాశీబుగ్గ సూదికొండలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు.

'శంఖారావం'తో టిడిపిలో నూతనోత్తేజం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం శంఖారావం బహిరంగ సభతో టిడిపిలో నూతనోత్తేజం కనిపిస్తుంది. కేవలం రెండు రోజుల గడువులో శంఖారావం సభ ఏర్పాటుపై సందేహ పడినా... చివరికి అనూహ్య విజవంతంగా కావడంతో పార్టీలో నూతన ఉత్సాహం వచ్చింది. అమరావతి నుంచే ఇచ్ఛాపురం సభ ఏర్పాట్లు క్యాడర్ సమాయత్తం చేయడంలో ఎమ్మెల్యే అశోక్ విజయవంతమయ్యారు. అతితక్కువ సమయంలో జన సమీకరణ రావడం, సమావేశం చివరి వరకు వేచి ఉండడం టిడిపికి నమ్మకం పెరిగింది. రాష్ట్రంలో ఎటువంటి పరిస్థితులు ఉన్న ఇచ్ఛాపురంలో మాత్రం టిడిపి విజయాలను ఎవరూ అడ్డుకోలేరని అనేక ఎన్నికలు ఫలితాలు స్పష్టం చేసింది. ప్రస్తుత మారుతున్న రాజకీయ పరిణామాల మధ్య మరోసారి టిడిపి తన సత్తా చూపేందుకు సంసిద్ధం అవుతుంది.

మరో వైపు ఇచ్ఛాపురం టిడిపి కంచుకోటపై కన్ను పడిన వైసిపి పెద్దలకు ఈ సారి ఎన్నికలో జెండా ఎగుర వేయాలని గట్టి పట్టుదలతో అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. నియోజకవర్గంలో ప్రధాన సామాజిక తరగతులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టి వైసిపి తనకు అనుకూలంగా మార్చుకుని ఎన్నికల్లో టిడిపితో తలపడేందుకు వైసిపి పిరియా విజయ, సాయిరాజ్ విస్తృతంగా పర్యటించి ప్రజల మద్దతు కోరుతుంది. ఇప్పటికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై ప్రజల్లో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. వైసిపిలో కొంత మంది నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో పార్టీకి నష్టం కలిగించే అంశం. దానిని అధిగమించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నాలు చేస్తే ఎలా అధిగమించాలని పథకాలు రూపొందిస్తున్నారు.

టిడిపికి అయితే సొంతింటి కుంపటి లేకపోవడం, తోడుగా జన సైనికులు అండ దండలు లభించడం వల్ల చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో నేతలు ధీమాగా ఉన్నట్లు సమాచారం. ఎమ్మెల్యే అశోక్ మాత్రం ఏ చిన్న అవకాశం దొరికినా వదలవద్దని పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పుడు నారా లోకేష్ పర్యటనతో టిడిపిలో కొత్త ఉత్సాహం వచ్చింది.

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి ప్రేమకాజల్

పోలీసు స్పందనకు 32 వినతులు

శ్రీకాకుళం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన'లో జిల్లా అదనపు ఎస్‌పి డాక్టర్ ప్రేమకాజల్ నేరుగా సోమవారం ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు సమస్యలను విన్నవించుకున్నారు. ఆమె సానుకూలంగా స్పందించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలన్నారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు 3, చీటింగ్ 4, హెర్సిమెంట్ 2, ప్రాపర్టీ 7, సివిల్ 5, పాతది 1, ఇతర అంశాలపై 10 మొత్తం 32 ఫిర్యాదులు అందాయి.

మంత్రిని సన్మానిస్తున్న ఎడి యోగేశ్వరరావు

పశుసంవర్ధకశాఖ ఎడిగా యోగేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్ : జిల్లా పశుసంవర్ధకశాఖ ఐఎస్‌డిపి సహాయ సంచాలకులుగా డాక్టర్ బమ్మిడి యోగేశ్వరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం రాగోలు పశువైద్యశాలలో పశువైద్య సహాయక శస్త్ర చికిత్స అధికారిగా పనిచేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు సోమవారం పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్‌కు ఉత్తర్వులు అందాయి. సమగ్ర గొర్రెల అభివృద్ధి పథకం విభాగానికి సహాయ సంచాలకులుగా వ్యవహరించనున్నారు. అనంతరం పలాసలోని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ పుర్బే

ఇండియన్ బ్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి- టెక్కలి

ఇండియన్ బ్యాంకు సేవలు ఖాతాదారులకు మరింత చేరువ అవుతుందని జోనల్ మేనేజర్ ఎ.కె.పుర్బే, ఫీల్డ్ జనరల్ మేనేజర్ గణేష్‌రామన్ అన్నారు. విశాఖలో వర్చువల్ విధానంలో టెక్కలి శాఖను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.11.64 లక్షల కోట్లు అధిగమించినట్లు వివరించారు. అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లా, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఇండియన్ బ్యాంకు జోనల్ ఆఫీసు పరిధిలో మొత్తం 50 శాఖలు ఉన్నాయని అన్నారు. సుమారు రూ.9,600 కోట్ల వ్యాపారం నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో టెక్కలిశాఖ బ్రాంచ్ మేనేజర్ ఎ.శ్రీకాంత్ పాల్గొన్నారు.

మల్లన్న తలపాగాను ఊరేగిస్తున్న చేనేత కార్మికులు

మల్లన్న తలపాగా ఊరేగింపు

లావేరు : మండల కేంద్రం లావేరులో శ్రీశైలం మల్లికార్జున మల్లన్న తలపాగాను సోమవారం ఊరేగింపు నిర్వహించారు. స్థానిక పెద్ద వీధికి చెందిన చేనేత కార్మికులు కాశీన వెంకటరమణ సోదరులు 365 అడుగుల తలపాగాను మగ్గంపై నేసి గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. ఈ తలపాగాను శ్రీశైలం ఆలయానికి అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఏడాది తయారు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీనువాసానంద స్వామి, కాసిన పద్మ, సవరరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

ఎన్ఇఆర్‌ని కలిసిన ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘువర్మ

మండలంలో నడుకుదిటి పాలెం బిజెపి క్యాంప్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) ను ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మర్యాద పూర్వకంగా సోమవారం కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, పలు రాజకీయాల కోసం చర్చించుకున్నారు.

శ్రీనివాసరావుకు గుర్తింపు

టెక్కలి : ఎపి ప్రయివేటు స్కూళ్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా టెక్కలి అమ్మఒడి పాఠశాలకు చెందిన కరస్పాండెంట్ బరాటం శ్రీనివాసరావుని సోమవారం ఎన్నుకున్నారు. ఈ మేరకు తిరుపతిలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాసరావుని కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర కార్యవర్గం ఏర్పడింది. టెక్కలికి చెందిన బరాటం శ్రీనివాసరావు రాష్ట్ర కార్యవర్గంలో స్థానాన్ని సంపాదించడంపై స్థానిక ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు అభినందించారు. ఈ మేరకు నౌపడ సింహాచలం, మల్ల మధులత, పద్మజ పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషిని అందజేస్తానని అన్నారు. అనంతరం శ్రీనివాసరావును రాష్ట్ర గౌరవ చైర్మన్ వి.సుందరం, కౌన్సిల్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, గౌరవ అధ్యక్షులు ఎం.జనర్ధానరావు సన్మానించారు.

సత్కరిస్తున్న సుందరం తదితరులు

టిడిపి, జనసేన పొత్తుతోనే రాష్ట్రాభివృద్ధి

జనసేన నాయకులతో అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి, జనసేన పొత్తుతోనే రాష్ట్రాభివృద్ధి చెందుతుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు జనసైనికులతో నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో తిరిగి వైసిపి అరాచకపాలన గురించి ప్రజలకు వివరించాలన్నారు. అలాగే టిడిపి పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి బాబ్జి నిమ్మాడలో అచ్చెన్నను కలిశారు. నందిగాం మండలం నందిగాం, నౌగాం పంచాయతీ నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, కోటబొమ్మాళి, విశ్వనాథపురం గ్రామాల నుంచి టిడిపి నాయకులు కలిశారు. కార్యక్రమంలో నందిగాం మండల పార్టీ అధ్యక్షుడు పినకాన అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పలువురి చేరిక

సంతబొమ్మాళి మండలం లింగూడు పంచాయతీ నుంచి వైసిపి నాయకులు బొంగు అప్పారావు, గిన్ని సత్యం, పరపటి దానయ్య, జీరు కృష్ణారావు, మోస గురుమూర్తి, గిన్ని శ్రీరాములు, మోస శ్రీరాములు, జీరు భీమారావు, దుర్గారావు తదితరులు అచ్చెన్న సమక్షంలో టిడిపిలోకి చేశారు.

సమ్మెలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల భాగస్వామ్యం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక, కర్షక, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త గ్రామీణ సమ్మెలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఎవగస్వాములు కావాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావులు పిలుపునిచ్చారు. సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాజ్‌పాయి ప్రధానిగా ఉన్న కాలంలోనే టెలికాం రంగాన్ని కార్పొరేషన్ పరిధిలోకి మార్చిన క్రమంలో ఉద్యోగులకు నిర్దిష్టమైన కొన్ని హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీలు నెరవేర్చకపోవడం వల్లే సంస్థ నష్టాల్లోకి నెట్టబడిందని అన్నారు. ప్రయివేటు కంపెనీలకు ధీటుగా ఆర్థిక పరిపుష్టి కల్పిస్తామని నమ్మబలికిన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు మేలు చేకూర్చే విధానాలను అమలు చేయడంతో పూర్తి నష్టాల్లోకి కూరుకుపోయిందన్నారు. 4జి, 5జి సేవలు ప్రారంభించకపోవడంతో త్రైమాసికంగా 65 లక్షల మొబైల్ కనెక్షన్లను కోల్పోవాల్సి వచ్చిందన్నారు.

మాట్లాడుతున్న వెంకటరావు

ఇటువంటి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా దేశవ్యాప్త సమ్మెలో భాగస్వాములు కావాలన్నారు. సమావేశంలో మాజీ కార్యదర్శి వెంకటరావు పాణిగ్రహి, ఎఐబిడిపిఎ నాయకులు జగన్నాయకులు, హెచ్.ఢిల్లేశ్వరరావు, వెలమల శ్రీనివాసరావు, కిరణ్, మల్లేసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

జిల్లా అభివృద్ధికి మీరేం చేశారు?

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

40 ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్ల అధికారంలో ఉండి చంద్రబాబునాయుడు శ్రీకాకుళం జిల్లాకు ఏం చేశారని నారా లోకేష్ అడుగు పెట్టారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వెంకటేశ్వరరావు వ్యాఖ్యానించారు. మండలంలోని అక్కవరం సమీపంలో తన స్వగృహంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. టెక్కలి నియోజకవర్గం రూ.1600 కోట్లు సంక్షేమానికి సిఎం జగన్ ఖర్చు చేశారని అన్నారు. రూ.4,300 కోట్లతో మూలపేట పోర్టు నిర్మాణం జరుగుతుందని, ఇంకేం చేయాలని లోకేష్‌ను ప్రశ్నించారు. చంద్రబాబు గల్లి నుంచి ఢిల్లీ వరకు చేసిన అక్రమాలన్నీ నాకు తెలుసని, నేను ప్రశ్నిస్తాను, ఎక్కడైనా సమాధానం చెప్పగలరా? అని పేర్కొన్నారు. లోకేష్ శంఖారావం ద్వారా ప్రజలు మరికొంత దూరమవుతారని, ఈ జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్, టెక్కలి నియోజకవర్గం గెలిపించిన వరకు నిద్రపోనని తెలిపారు.

ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ చేసుకునేందుకు తక్షణమే అవకాశం కల్పించాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్ షిప్‌కు కేటాయింపుపై బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్యతో కలిసి సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2021-22 డిగ్రీ విద్యార్థుల ఇంటర్న్ షిప్‌కు ప్రభుత్వ శాఖాధికారులు కేటాయించిన విధంగా విద్యార్థులను తీసుకోవాలని ఆదేశించారు. 15 వారాలు లాంగ్ టెర్మ్ ఇంటర్న్ షిప్‌కు కేటాయించామన్నారు. ప్రస్తుతం 5,445 మంది విద్యార్థులను 27 శాఖలకు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో 2,000 మంది సచివాలయాలకు, 1,770 మందికి విద్యాశాఖలో, 452 మందికి వైద్య, ఆరోగ్య శాఖలకు అత్యధికంగా కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు వెళ్లాల్సిన అధికారి పేరు, ఫోన్ నంబర్లను విద్యార్థులకు అందజేయాలన్నారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జిల్లా అటవీ శాఖ అధికారి నిషాకుమారి, జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, సిటిఒ రాణీమోహన్ పాల్గొన్నారు.

ఇఎస్ఐసి బాండు అందజేత

శ్రీకాకుళం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధర్మవరపు శ్రీనివాసరావు కుటుంబానికి ఇఎస్ఐసి పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని బ్రాంచ్ మేనేజర్ ప్రజ్ఞ తెలిపారు. సోమవారం ఇఎస్ఐసి కార్యాలయంలో మృతుడు కుటుంబసభ్యులకు ఇఎస్ఐసి బాండును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాసరావు జిఎన్ జ్యూయలర్స్‌లో పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో ప్రమాదానికి గురై మరణించాడని తెలిపారు. కార్మికులు పనిచేసే చోట, పనికి

బాండు పేపరును అందజేస్తున్న బ్రాంచ్ మేనేజర్ ప్రజ్ఞ

వెళ్లేటప్పుడు, పని నుంచి వచ్చేటప్పుడు ఏదైనా ప్రమాదం వలన మరణిస్తే ఆ కుటుంబాలకి అండగా ఇఎస్ఐసి పెన్షన్ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఇఎస్ఐసి డాక్టర్ ప్రజ్ఞ, సహాయక సిబ్బంది ఎస్.వి.రమణ, దొరబాబుతో పాటు జిఎన్ జ్యూలయర్స్ అధినేత జి.కృష్ణ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి - కవిటి

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని డి.జి.పుట్టుగ గ్రామ సచివాలయంలో సోమవారం ఉదయం 11 గంటలు దాటినా సచివాలయం తలుపులు తెరుచుకోలేదు. అయితే అప్పటికే కొంతమంది గ్రామస్తులు సచివాలయ సిబ్బంది కోసం అక్కడ ఎదురుచూడడం కనిపించింది. దీనిపై వారిని సంప్రదించగా తమకు ఇది కొత్తకాదని తమ సచివాలయం ఎప్పుడు ఏ సమయానికి తీస్తారో తెలియదని చెప్పారు. ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్యలో ఎప్పుడైనా

ఎదురుచూస్తున్న గ్రామస్తులు

తెరుచుకోవచ్చని వ్యంగ్యంగా సమాధానమిచ్చారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతంలో ఉండడంతో తమ సచివాలయంపై ఎవరి పర్యవేక్షణ లేదని, దీంతో సిబ్బంది ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు తెలిపారు.

విధానాలు నచ్చకే వైసిపిని వీడుతున్నా...

మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

ప్రజాశక్తి - నందిగాం

వైసిపి విధానాలు నచ్చకే పార్టీని వీడుతున్నాని మండలంలోని పెద్దబానాపురం సర్పంచ్ బయలు ఇంద్రవేని, భర్త పైల రమేష్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తనతో పాటు మరో 500 కుటుంబాలు వైసిపిని వీడుతున్నమని ప్రకటించారు. ప్రజా సేవకులైన పార్టీలో చేరుతామని ప్రకటించారు. తన సమీప బంధువుల, మాజీ ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొరలా ప్రజాసేవ చేయాలనే సంకల్పం ప్రస్తుత అధికార పక్షంలో కనిపించడం లేదని తెలిపారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సర్వేను నిలుపుదల చేయాలని వినతి

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలంలో జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణానికి చేపడుతున్న సర్వేను నిలుపుదల చేయాలని రణస్థలం ఫ్లైఓవర్ వ్యతిరేక కమిటీసభ్యులు సోమవారం తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి డిజిపి ఆనందరావు, వైస్ ఎంపిపి రాయపురెడ్డి భుజంగరావు, సర్పంచ్ భవిరి రమణ, టిడిపి నాయకులు డాక్టర్ దురగాశి రామారావు, వైసిపి నాయకులు పిన్నింటి సత్యం నాయుడు, ఇడదాసుల తిరుపతి రాజు, సీనియర్ జర్నలిస్ట్ అల్లు యుగంధర్ తదితరులు మాట్లాడుతూ జె.ఆర్.పురం గ్రామ పంచాయతీలో కొన్ని తరాలుగా నివాసం ఉంటున్నామని, ఊరు మధ్య నుంచి 16వ నెంబర్ జాతీయ రహదారి ఉందని, 20 ఏళ్ల క్రితం జాతీయ రహదారి నాలుగు లైన్లు విస్తరణ కోసం మా భూములను కొంతమేర కోల్పోయి ఇప్పుడిప్పుడే శాశ్వత భవనాలు నిర్మించుకొని చిరు వ్యాపారాలు చేసుకొంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. ఇటీవల జాతీయ రహదారుల సంస్థ, రెవెన్యూ శాఖ సర్వే సిబ్బంది మా ఆస్తుల వద్దకు వచ్చి కొలతలు వేస్తున్నారని, జాతీయ రహదారి విస్తరణలో భాగంగా జె.ఆర్.పురంలో ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఈ సర్వే చేస్తున్నట్లు చెప్పారన్నారు. దీంతో జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న వ్యాపారులు, నివాసం ఉంటున్న వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్లై ఓవర్ నిర్మాణం చేపడితే వ్యాపారాలు దెబ్బతింటాయని, పలువురు ఉపాధి కోల్పోతారన్నారు. వెంటనే సర్వేను, ఫ్లై ఓవర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

టిడిపి కండువా వేస్తున్న శిరీష

టిడిపిలో పలువురి చేరిక

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 12వ వార్డు నుంచి మాజీ ఎంపిటిసి మీల జోగారావు, మాజీ కౌన్సిలర్ మర్రి రోజా, మర్రి వేణు, మాజీ కౌన్సిలర్ దుబ్బ చిన్నమ్మతో వంద మంది సోమవారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వారికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బాబూరావు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, నవీన్, గాలి కృష్ణారావు, అంబటి కృష్ణమూర్తి, చక్రధర్, నరసింహులు పాల్గొన్నారు.

బాండ్ పేపర్‌ను చూపిస్తున్న బాబూరావు

వారిని విమర్శించే స్థాయి అప్పలరాజుకు లేదు

పలాస: టిడిపి అధ్యకుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, గౌతు శివాజీ, శిరీష కుటుంబ సభ్యులను పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు విమర్శించడం సిగ్గుచేటని, వారిని విమర్శించే స్థాయి మంత్రికి లేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. లోకేష్ ఎన్నికల శంఖారావం సభ విజయవంతం కావడంతో మంత్రి ఓర్వలేక చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి మెప్పుకోసమే మంత్రి తమ నాయకులను తూలనాడుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్‌గా హుందాగా ఉండాలే తప్ప యాక్టరుగా వెకిలివేషాలు వేయవద్దని సూచించారు.

ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ పరిధిలో నారాయణపురం కొండను కొంతమంది ఆక్రమించుకున్నారని, ఆక్రమణలు తొలగించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. సోషల్ ఫారెస్టు పరిధిలోని భూమిని ఆక్రమించుకొని తోటలు వేసుకున్నారని, ఈ విషయమై గత మండల సమావేశంలో ప్రస్తావించామని అన్నారు. అలాగే తహశీల్దార్‌కు, రెవెన్యూ అధికారులకు అర్జీలు పెట్టినా స్పందన లేదన్నారు. అటవీశాఖ అధికారులు జోక్యం చేసుకొని భూ ఆక్రమణదారుల నుంచి కాపాడి పేదలు తోటలు పెంపకానికి అనువుగా కేటాయించాలని కోరారు. మండలంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని, లోఓల్టేజి, స్తంభాలు మార్చడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని సర్పంచ్‌లు అట్టాడ గోపి, కర్ని శ్రీను, అంబటి రాజు, ఎంపిటిసి మాకయ్య అన్నారు. అక్కుపల్లి పాఠశాలలో నాడు-నేడు కింద పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదని, ఈ నెల 20లోగా పనులు ప్రారంభించకుంటే పాఠశాలకు తాళాలు వేస్తామని అక్కుపల్లి సర్పంచ్ ప్రతినిధి లండ రామలింగం హెచ్చరించారు. అన్నిచోట్లా నాడు-నేడు పనులు శరవేగంగా జరుగుతుంటే అక్కుపల్లిలో ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. సీతాపురం అంగన్వాడీ కేంద్రానికి శాశ్వత భవనం లేదని, ఐసిడిఎస్ నుంచి రూ.1.20 లక్షలు నిధులు మంజూరు చేశారని అన్నారు. పాఠశాల వరండాలో గది నిర్మాణానికి అనుమతి కావాలని సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు కోరారు. విద్యాశాఖ అధికారి డి.దాశరధి మాట్లాడుతూ పాఠశాలను పరిశీలించి ఉన్నతాధికారుల సూచనలు తీసుకుంటామని తెలిపారు. ఉద్దానంలో ఎలుగుల సంచారంపై అటవీశాఖ ప్రత్యేక దృష్టిసారించాలని జోగి అప్పారావు, ఎంపిటిసి బమ్మిడి రాజేశ్వరిలు కోరారు. జెడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పాలిన శ్రావణి మాట్లాడుతూ మండల సమావేశాలకు అధికారులు డుమ్మా కొట్టడం సరైన పద్ధతి కాదని అన్నారు. దీనిపై మినిట్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ముందుకెళ్తే అభివృద్ధి సాధ్యమని అన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపిలు శ్రావణి, వంక రాజు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ డిక్కల తిరుమలరావు, డిటి వాయిలపల్లి గిరిరాజ్, మండల విప్ తిర్రి గుణవతి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ ఢిల్లీరావు

నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎచ్చెర్ల మండల ఉపాధ్యక్షులు జరుగుళ్ల శంకర్‌పై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. నగరంలో ఏడురోడ్ల కూడలి నుంచి జిల్లా ఎస్‌పి కార్యాలయం వరకు ఈప్రదర్శన కొనసాగింది. ప్రదర్శన అనంతరం ఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి- నందిగాం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నందిగాంకు చెందిన నక్క బాలకృష్ణ కుటుంబాన్ని అలాగే వల్లభరాయపాడు పంచాయతీ మణిగాం గ్రామానికి చెందిన ఎర్ర రఘురాజు కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయనతో పాటు కుటుంబసభ్యులు నక్క మహాలక్ష్మి, ఎర్ర కొండలరావు, టిడిపి నాయకులు పి.అజయ్ కుమార్, కె.తాతయ్య, రవిప్రసాద్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరావు, సింహాచలం ఉన్నారు.

మాట్లాడుతున్న విజయ

వైసిపి గెలుపునకు కృషి

ప్రజాశక్తి - సోంపేట

రానున్న ఎన్నికల్లో ఎంపీ, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థులు గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా పార్లమెంటరీ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బారువ రిసార్ట్స్‌లో పార్టీ ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ అభివృద్ధికి సిఎం జగన్ కృషి చేశారని అన్నారు. సమావేశంలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయ, పేరాడ తిలక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ పాల్గొన్నారు.

ఉప విద్యాశాఖాధికారి బాధ్యతల స్వీకరణ

టెక్కలి : టెక్కలి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారినిగా ఆర్.విజయ్‌కుమారి సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు ఉప విద్యాశాఖ కార్యాలయానికి చేరుకున్న ఆమెకు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. స్థానిక బాలికోన్నత, బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించారు. లిప్ ప్రోగ్రాంపై జరుగుతున్న పర్యవేక్షణను పరిశీలించారు. అలాగే ఈ నెల 15న స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్న సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈమెతో పాటు ప్రధానోపాధ్యాయులు ఎం.శోభారాణి. ఎ.నాగభూషణం, సిబ్బంది కుప్పిలి నగేష్. ప్రకాష్ ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపైనా చూపాలని విజయ్‌కుమార్ సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో జోనల్ టు క్రీడలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు క్రీడలు నిర్వహించనున్నామని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం బాడన నారాయణరావు తెలిపారు. టెక్కలి, పాతపట్నం, నియోజకవర్గ పరిధిలోని 90 పాఠశాల నుంచి 150 మంది విద్యార్థులు హాజరయ్యారని అన్నారు. సోమవారం వాలీబాల్, కబాడ్డీ, ఖోఖో క్రీడలను ఆడించారు. కార్యక్రమంలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, చిన్నారావు, వ్యాయామ ఉపాధ్యాయులు రాజా, శేఖర్, రామిరెడ్డి, రమణ, త్రినాథరావు పాల్గొన్నారు.

గిరిజన అభ్యర్థులతో ఉద్యోగాలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి- పలాస

ఐటిడిఎలో గిరిజన అభ్యర్థులతో ఖాళీలు ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని గిరిజన జెఎసి జిల్లా అధ్యక్షుడు సవర రాంబాబు డిమాండ్ చేశారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదివారం పలాసలో వచ్చిన సందర్భంగా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో బెంతు ఒరియాలు లేరని, ఎస్‌టి జాబితాలో బెంతు ఒరియాలను చేర్చరాదని అన్నారు. జిల్లాలో గిరిజనులకు ఆమోద యోగ్యంగా నూతన ఐటిడిఎను ఏర్పాటు చేయాలని కోరారు. ట్రైకార్ రుణాలు మరలా గిరిజనులకు మంజూరు చేయాలని కోరారు. పలాస కేంద్రంగా ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా గురుకుల బాలికల కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు.

జీడి, కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలి

ఉద్దాన ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటలపై రైతులు ఆధారపడి జీవిస్తున్నారని, పలాస ప్రాంతంలో జీడి, కొబ్బరి పంటలకు బోర్డులను ఏర్పాటు చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ జిల్లా సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 80 కేజీల పిక్కల బస్తా రూ. 16 వేలు ఇవ్వాలని కోరారు. వంశధార ఎడమ కాలువ ఇచ్ఛాపురం వరకు పొడిగించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, మామిడి మాధవరావు, గొర్లె చలపతి, మద్దిల ధర్మారావు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్రీనివాస్

ఉచిత వైద్యశిబిరం

ఎచ్చెర్ల: మండలం తమినాయుడు పేటలో సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్, సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేయాలి

పోస్టర్‌ను విడుదల చేస్తున్న వాకర్స్‌ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో నడక సంఘాలు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నాయని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, బివి రవిశంకర్, ఎస్.జోగినాయుడు, బి. దేవీ ప్రసాద్ అన్నారు. ఈ నెల 16న శ్రీధర్మశాస్త్ర సన్నిధానం ట్రస్ట్ ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా అరసవల్లి దేవస్థానం సమీపంలో ఏర్పాటు చేసిన మహా రక్తదాన శిబిరానికి యువత, అన్ని వర్గాల వారు పెద్దఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లాలో రక్తం కొరత ఎక్కువగా వుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని పెద్దఎత్తున నడక సంఘాల ఆధ్వర్యాన రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ విధిగా రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు బరాటం సంతోష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్

ఎంఇఒలను సన్మానిస్తున్న పాఠశాల సిబ్బంది

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్, మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని ఎంఇఒలు ఎస్.అప్పలరాజు, ఎల్.వి.ప్రతాప్‌లు అన్నారు. మండలంలోని ఎత్తురాళ్లపాడు సమీపంలోని సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం నిర్వహించిన పాఠశాల 21వ వార్షికోత్సవం, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థులు వేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సరస్వతి విద్యానికేతన్ చీఫ్ అడ్వైజర్ గురువెల్లి అప్పన్న, కరస్పాండెంట్ బాప శ్రీనివాస్ భావని, పాఠశాల ప్రిన్సిపాల్ తమ్మినేని లక్ష్మణరావులు ఎంఇఒలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు తలగాన గణపతి, నూక సత్యరాజు, గురువెల్లి భారతి సూర్యప్రకాష్, సాయివిద్య మందిర్ పాఠశాల అధినేత బూరగాపు లక్ష్మణరావు, ఆర్.సుధాకర్ పాల్గొన్నారు. కాగా, ఈ నెల 11న పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఉచితంగా సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నామని, మూడేళ్లలోపు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించేసుకోవాలని కోరుతున్నారు. చిన్నారులకు పలక, బలపం ఉచితంగా అందజేస్తామని అన్నారు.

నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా ఫ్రెషర్స్ డే

సోంపేట : ప్రతి ఒక్క విద్యార్థీ ఇష్టపడి చదువుకోవాలని మహర్షి విద్యానికేతన్ పాఠశాల మేనేజ్‌మెంట్ సభ్యులు జి.వి.ఎస్.ఎస్.ప్రసాద్ సూచంచారు. పట్టణంలోని మహర్షి విద్యానికేతన్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాలయాల్లో క్రమశిక్షణతో, పట్టుదలతో, ఏకగ్రతతో, సోదరభావంతో మెలిగి లక్ష్య సాధనకు దిశగా చదువకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సినీ పాటకు నృత్యం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తరని ప్రసాద్ పండా, మురళి, ఎల్.శకుంతల పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రైతులు

న్యాయం చేయాలని రైతుల వినతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మారేడుకోటలో ఇనాం భూముల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో డిటి టి.శంకరరావును సోమవారం రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన నందిగాం ధనుంజయకి రెండు ఎకరాల 15 సెంట్లు ఉండగా, 142 ఎకరాలు ఇనాం భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో నమోదైందని అన్నారు. అలాగే ఇప్పిలి రామకృష్ణకు ఎకరా 50 సెంట్లు ఉండగా, 1,900 ఎకరాలు ఉన్నట్లు, తమరి వజ్రంకు 50 సెంట్లు ఉండగా, 2000 ఎకరాలు ఇనాం భూములు ఉన్నట్లు రికార్డులో నమోదైందన్నారు. తమ సాగులో లేని భూములు ఉన్నట్లు చూపించి ప్రభుత్వ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పెద్దింటి శ్రీనివాసరావు, మజ్జి పోలినాయుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరానికి స్పందన

ప్రజాశక్తి- రణస్థలం

నేత్రాల పరిరక్షణకు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కళ్యాణి కంటి ఆస్పత్రి పారామెడికల్ అప్తాలమిక్ ఆఫీసర్ ఎస్.కళ్యాణి తెలిపారు. మండల కేంద్రంలో బ్రహ్మణవీధిలో ఉన్న కళ్యాణి కంటి ఆస్పత్రి ఆవరణలో సోమవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి 65 మంది హాజరయ్యారు. నేత్ర పరీక్షలు నిర్వహించి 17 మందిని శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసి శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ఇంద్రియాలు అన్నింటిలో కన్ను ప్రధానమైదని, మనకు చూపును ప్రసాదించే కళ్లను సంరక్షించుకోవడం మన బాధ్యతన్నారు. క్యారెట్, తాజా పండ్లు, ఆకుకూరలు, పాలు, గుడ్డులోని పచ్చసొనల్లో విటమిన్ ఎ ఉంటుందని ఇది నేత్ర ఆరోగ్యానికి మంచిదన్నారు. కంటిచూపు మసకబారటం, నొప్పి, కళ్లముందు మిరుమిట్లు గొలిపే కాంతులు, మెరవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు.

శస్త్రచికిత్సల కోసం బస్సులో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న రోగులు

దీక్షలో పాల్గొన్న రజనీ కుమార్ దొలై

మా జీవితాలతో ఆడుకోవద్దు

ప్రజాశక్తి- కవిటి

ప్రజా ప్రతినిధులు, అధికారులు తమ జీవితాలతో ఆడుకోవద్దని, తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేసి తమ బిడ్డలకు భవిష్యత్ చూపించాలని బెంతు ఓరియాల ప్రతినిధి రజనీకుమార్ దొలై కోరారు. ఒంతు ఒరియాలకు గుర్తింపు, భవిష్యత్ భరోసా కోసం కవిటిలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 47వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఒంతు ఒరియాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలకూ దూరమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బెంతు ఒరియాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నారాయణమూర్తికి పురస్కారం

టెక్కలి : మండలంలోని రావివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న మార్పు నారాయణమూర్తికి పురస్కారం లభించింది. రెండు రోజుల క్రితం తిరుపతిలో నిర్వహించిన భారత దేశ సంస్కృతి నాగరికత అనే అంశంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న నారాయణమూర్తి 'ఏడుకొండలవానికి నీరాజనం' అనే చిత్రాన్ని గీశారు. దీనికి బృందం ప్రశంసిస్తూ అభినందించారు. నారాయణమూర్తికి పురస్కారం లభించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

నియామకపత్రం అందుకుంటున్న షణ్ముఖరావు

జెసిఐ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : జెసిఐ నూతన అధ్యక్షులుగా టి.షణ్ముఖరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు జెసిఐ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సిహెచ్.పవన్, కోశాధికారి వి.ప్రేమ్‌సాయిలు ఎన్నికయ్యారు. అనంతరం బెల్లుపడి హైవే వద్ద స్వాగత పలాకాన్ని జోన్ ప్రెసిడెంట్ సురేష్ ప్రారంభించారు. గతేడాదిలో చేసిన కార్యక్రమాల గురించి మాజీ అధ్యక్షులు స్వరూప్‌కుమార వివరించారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, ఢిల్లేషు, వెచ్చ సంతోష్, స్నిగ్ధ, ప్రతి క్రదీప్, సందీప్, డోకి నరేంద్ర, ప్రత్తి వీరకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు

ప్రజాశక్తి- పొందూరు

మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను విక్రయించేందుకు ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఎటిఎం మోడల్‌లో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతులతో పాటు పలు రకాల కూరగాయలను ఈ స్టాల్ ద్వారా విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతీ సోమవారం ఈ విధంగా ఈ ఉత్పత్తులను విక్రయించనున్నట్లు సిబ్బంది తెలిపారు.

15లోగా ఈ-క్రాప్

ఇచ్ఛాపురం : ఈ నెల 15లోగా రబీ పంటకు రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలని మండల ఎఒ టి.భార్గవి సూచించారు. ఆమె అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ-క్రాప్, సిఎం కిసాన్‌కు ఇకెవైసిలు చేయించుకోకుంటే గ్రామాల్లో సందర్శించి గ్రామసభలు నిర్వహించి రైతులకు తెలియజేయాలన్నారు. ధాన్యం కోనుగోలు కేంద్రాలు ఇంకో వారం రోజుల్లో ముగుస్తుందని, రైతులు ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. రబీ సీజన్‌కు యూరియా, ఎరువులు, కేసుపురం, ఈదుపురం ఆర్‌బికెల్లో అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో సలహా మండలి అధ్యక్షుడు నూకయ్యరెడ్డి, ఎంపిపి బోర పుష్ప, మాజీ ఎంపిపి రాకంగి మోహనరావు, జెడ్‌పిటిసి ప్రతినిధి ఉప్పాడ రాజారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల్లో అవినీతిపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్రం అమలు చేసిన జగనన్న కాలనీల్లో అవినీతి రాజ్యమేలుతోందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు సబ్ కలెక్టరేట్‌లో కలెక్టర్ నూరల్ కమల్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగతి సంబంధించి శ్యాంసుందరాపురం, మెట్టదరి జగనన్న లేఅవుట్లో అనర్హులకే పెద్ద మొత్తంలో పట్టాలు మంజూరయ్యాని అన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి అర్హులకు అందజేయాలన్నారు. అలాగే విలేకరులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

25న భవన నిర్మాణానికి శంకుస్థాపన

రణస్థలం రూరల్: మండలం కొండములగాం పంచాయతీ ముక్తుంపురం వద్ద ఈ నెల 25న ఆదివారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపనతో పాటు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని అంబేద్కర్ సామాజిక భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దువ్వాన అప్పలసూరి మాస్టారు అన్నారు. సోమవారం సంఘంసభ్యులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఉండే దళితులు, బడుగు బలహీన వర్గాలు, అంబేద్కర్ వాదులు, విద్యార్థులు, ఉద్యోగులు, కార్మిక, కర్షకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సింక అప్పారావు, నేతల కృష్ణ, దండాశి జాన్, సింక సత్యప్రసాద్, నేతల సురేష్, యామల కృష్ణ, బొమ్మలాట శ్రీరామ్, లింగాల ఈశ్వరరావు, బుడుమూరు ఎల్లారావు, తోట ఆదినారాయణ, బాలు, ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుపతిలో కళింగ కోమట్ల సత్రానికి స్థలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తిరుమల తిరుపతి దేవస్థానం సందర్శించడానికి వెళ్లే కళింగ కోమట్ల విడిది, కళ్యాణం వంటి కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు వీలుగా దిగువ తిరుపతిలో స్థలాన్ని కేటాయించడం ఆనందదాయకమని కళింగ కోమటి కార్పోరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రెవిన్యూమంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు టిటిడి చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కళింగ కోమట్లను బిసి జాబితాలో చేరుస్తూ జిఒ 25 విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి కల్పించాలని ధర్నా

పార్వతీపురం: ఉపాధిహామీ పనులు కల్పించాలని వెలగవలస పంచాయతీ పరిధిలోని గ్రామాల గిరిజనులు కలెక్టరేట్ వద్ద గిరిజన, వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేశారు. తొలుత స్థానిక సుందరయ్య భవనం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేసి, అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలోని కొత్త పంచాయితీ వెలగవలస పరిధిలో గల పిండిలోవ, బిలగుడ్డి వలస, దోనిగుడివలస, సంగివలస గిరిజన గ్రామాల్లో రెండేళ్ల నుంచి ఉపాధి పనులు ఇవ్వలేదన్నారు. ములగ పంచాయతీలో ఉన్న వెలగవలస పంచాయతీని వేరు చేయడం వల్ల ఆన్లైన్లో పంచాయతీ చూపించడంలేదని, ఆన్లైన్లో లేని గ్రామాలకు ఉపాధి హామీ పనులు చేపట్టలేమని సిబ్బంది చెబుతున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వెలగవలస పంచాయతీలో ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తడంగి కృష్ణయ్య, ఆర్.సాంబయ్య, రాము, వేతనదారులు పాల్గొన్నారు. వీరి ఆందోళనకు సిపిఎం మద్దతు తెలిపింది.

వైఎస్ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- కవిటి

ఆపద సమయంలో వైఎస్ఆర్ బీమా ఆదుకుంటుందని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని లండారిపుట్టుగలో మామిడి రాముడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ రామారావు సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బీమా నగదు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

అనంతరం ప్రభుత్వం అందించే వైఎస్ఆర్ బీమా రూ.లక్ష చెక్కును అందజేశారు.

పాస్టర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం, కవిటి మండలాల ప్లాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలంలో ఈదుపురం లోబాపిస్ట్ చర్చిలో రెండు మండలాల పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు.. జిల్లా పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ డి.ఎస్.వి.ఎస్.కుమార్ బలపరిచారు. ఫాస్టర్లందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా డి.ఏలియా ఫిలోషిప్, ప్రెసిడెంట్‌గా బండారి ప్రభుదాస్, సెక్రటరీగా ఎ.సుందరరాజు, ట్రెజరర్‌గా ఎం.పౌలు, వైస్ ప్రెసిడెంట్‌గా వై.ప్రభుదాస్, జాయింట్ సెక్రటరీగా ప్రసన్నకుమార్, ఫెలోషిప్ సలహాదారులుగా ఎం.అబ్రహం, జి.ఏలియాలను ఎన్నుకున్నారు.

ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు